సన్మానం వెనుక ...

పాలకూర సీతాలత

పరమేశ్వర శాస్త్రి గారు స్టేజీ మీద నిలబడి హరికథ చెప్తుంటే ఎంతటివారైనా మంత్రముగ్ధులు కావల్సిందే. ఆ కంచు కంఠం, పురాణ విషయాలపై ఆయనకున్న జ్ఞానం, ఆ దబ్బనంటు శరీరం, ముఖవర్చస్సు – అన్నీ భగవత్ప్రసాదాలే అని అనుకుంటూ వుంటారు. మధ్య పాపిడి తీసి, నుదుటను తిరునామం ధరించి, పట్టుశాలువా, పట్టుపంచెలో, చేతులో చిరుతలతో, కాళ్లకు మువ్వ పట్టెలతో– ఆయన్ని చూడగానే భక్తిభావం పుట్టక మానదు. సమయానుకూలంగా ఆయన తన కథలో మధ్య మధ్య పిట్టకథలు జోడించి, కుర్రకారును కూడా ఆకట్టుకుంటారు. వృత్తి రీత్యా రకరకాల ఊర్లు తిరగడం, అవసరం అయితే ఒక ఊర్లోనే నెలల తరబడి వుండిపోవడం ఆయనకు అలవాటే.

ప్రస్తుతం ధర్మపురంలో ఆయన పది రోజులుగా వుంటున్నారు. మహాభారత గాథను ప్రతిరోజూ హరికథగా చెప్తున్నారు. మరొక ఇరవై రోజులు పడుతుంది.

ఆ ఊరి ప్రజలు పాపభీతి, ధర్మచింతన కలవారు. గణపతి నవరాత్రులు, దుర్గాపూజ, శ్రీరామ నవమి ఉత్సవాలు ఉమ్మడిగా చేస్తారు. అందుకు ప్రతి ఒక్కరూ చందాలు వేసుకుని, మెయిన్ సెంటర్లో పెద్ద పందిరి వేసి, నిలువెత్తు విగ్రహాలు ప్రతిష్టించి తమ భక్తి చాటుకుంటారు. ఈసారి కూడా దసరాఉత్సవాలు జరిపి, పరమేశ్వర శాస్త్రి గారి చేత నెలరోజుల పాటు హరికథ పెట్టించారు. ఆయన వాగ్ధాటికి ముగ్ధులై పోయారు. ఆ నెల రోజులూ ఆయనకు ఉచితవసతి, ఉచిత భోజన ఏర్పాట్లు గావించారు. హరికథకు విడిగా సొమ్ము ముట్టచెప్తారు. ప్రతిరోజూ కథ నడుస్తుండగా ఏర్పాట్లు చేసిన మంగళహారతి పళ్లెం ప్రేక్షకులందరిదగ్గరకూ వెళ్తుంది. అందులో వారు తమ సంతోషం కొద్దీ చిల్లరో, నోట్లో వేస్తారు... ఆ సొమ్ము ఆయనకే చెందుతుంది. ఆ పళ్లెంలో డబ్బులు దండిగా వెయ్యమని కోరేవారు.

"భక్తులారా... మంగళహారతి పళ్లెం మీ దగ్గరకు రాగానే తక్షణ మనసుకి తోచింది అందులో వెయ్యండి... అది ఐదుపైసలయినా సరే... పది పైసలయినాసరే... అంతేగానీ తర్వాత చూద్దాం అని ఆలోచించకండి... తోచిన దానం వెంటనే వెయ్యాలి కానీ తర్వాత ఎప్పుడో చూద్దాం అనుకోవద్దు... మంచి పనులు వెంటనే చెయ్యాలి... మహాదాత కర్ణుడే ఆలస్యం చెయ్యకూడదన్నాడు దానం విషయంలో... ఆ సందర్భంలో ఒక చిన్న కథ వినండి..." అంటూ ఒక పిట్టకథ చెప్పారు.

"మహాదాతగా పేరు పొందిన కర్ణుడు ఒకరోజు అభ్యంగన స్నానానికి తయారయ్యాడు. పరివారంలోని భృత్యులు బంగారు గిన్నెలతో నూనె తెచ్చి అతని శరీరానికి పూస్తున్నారు.

ఇంతలో ఒక పేద బ్రాహ్మణుడు కర్ణుని దర్శనార్థం రావడంతో తను అదేస్థితిలో వుండి బ్రాహ్మణుడిని ప్రవేశపెట్టమన్నాడు. అతను దానం కోరివచ్చిన విప్రుడు.

భూసురా!... "తీసుకోండి..." అంటూ తన ఎడంవైపువున్న బంగారు పాత్రను అదే చేతితో దానం ఇచ్చేశాడు.

ఆ బ్రాహ్మణుడు సంతోషించి –

"ప్రభూ! ... ఆ ఇచ్చిన దానం కుడిచేత్తో ఇస్తే దానఫలం దక్కేది కద... ఎడంచేత్తో ఏది ఇచ్చినా అది దానం కాబోదు అన్న విషయం తమరు ఎరుగనిదికాదు..." అన్నాడు.

చిరునవ్వు నవ్వాడు కర్ణుడు.

"విప్రోత్తమా! ఆ విషయం నాకు తెలియకకాదు ... పడివున్న బంగారు పాత్రలన్నీ నా ఎడంవైపే ఉన్నాయి. దాన్ని ఎడంచేత్తో తీసుకుని ఆ తర్వాత కుడిచేతిలోకి మార్చుకోవాలి ... అలా మార్చుకుందుకు పట్టే సమయంలో నా మనసు మారిపోవచ్చు ... దానం చెయ్యాలనుకున్న వెంటనే చేసెయ్యాలి తప్ప కాలయాపన చెయ్యరాదు..." అన్నాడు. ఇది ఆయన చెప్పిన కథ.

"కనుక భక్తులారా! మహాదాత అయిన కర్ణుడే తన మనసు మారిపోతుందని భయపడ్డాడు. సాధారణ మానవులం ... మనం ఎంత?" అన్నారు.

ఆ కథ అందరికీ నచ్చింది ... మంగళహారతి పళ్లెంలో దండిగా డబ్బులు పడ్డాయి.

"మంగళహారతి పళ్లెంలో డబ్బులువేస్తూ గళగళమన్పించండి ... దాన్ని నిండుగాచేసి కళకళలాడనియ్యండి" అన్నారు.

ఆయన హరికథా గానం ప్రతిరోజూ సాగుతూనేవుంది ... ప్రజలు ఆనందోత్సాహంతో చప్పట్లు కొడుతున్నారు. మంగళహారతి పళ్లెం నిండుతోంది. ఆయన జేబు నిండుతోంది. ఏ రోజూ పాతిక రూపాయలకు తక్కువ రావటం లేదు పళ్లెంలో. ఈ రకంగా చూస్తే కథ పూర్తయ్యేనాటికి ఏడెనిమిది వందలు కాకపోవు.

కథ పూర్తికావడానికి ఇక వారంరోజులే వుంది.

ప్రతిరోజూ భక్తి శ్రద్ధలతో కథ వింటూ, ఆయన వాక్చాతుర్యానికి మురిసిపోతూ. ఆయన్ని పొగుడుతున్న ఒకరు ... ఆమె పేరు శాంతమ్మ.

ఆ ఊరి జగన్నాథస్వామివారి కోవెల పూజారి రంగాచారిగారి చెల్లెలు ఆమె. ఆ ఊరికి చుట్టం చూపుగా వచ్చిన ఆవిడ ...

ఆమెకు ఆరోజు ఒక దివ్యమైన ఆలోచన వచ్చింది –

పరమేశ్వరశాస్త్రిగారు పురాణం చెప్పినందుకు కమిటీవారు డబ్బులియ్యడం వేరే సంగతి. ఆయన గొప్పతనానికి ముగ్ధులైన కొందరు పూనుకుని ఆయనకు సన్మానం చేసి ఒక 'పర్సు' బహూకరిస్తే ?...

ఆ ఆలోచన ఆమె ఒకరిద్దరికి చెప్పారు. పరమేశ్వరశాస్త్రిగారిపై గల గౌరవ మర్యాదల కారణంగా ఆమె మాటను తీసెయ్యలేకపోయారు.

"ఈ ఊరు నాకు కొత్త... అందర్నీ నేను ఎరుగను... కనుక ఈ సత్కార్యం ఫలించడంలో మీరంతా తోడు వుండాలి... ఒక్కొక్క ఇంటికీ వెళ్లి అందర్నీ ఒప్పించే ప్రయత్నం చేద్దాం... ఇందులో బలవంతం లేదనీ...ఎంత తోస్తే అంత ఇయ్యవచ్చనీ చెప్తాం... నేను నా తరవునుంచి... ఇదిగో...రెండువందలు ఇస్తున్నాను..." అంటూ అక్కడికక్కడే రెండువందలు తీసింది.

"ఈ ఉద్దేశ్యం కలిగింది మీకు ... సొమ్ము మీ దగ్గరే వుంచండి... మేం కూడా మాకు తోచినది ఇస్తాం... అందర్నీ కలిసి విషయం చెప్పి వారు ఇచ్చింది తీసుకుందాం..." అన్నారు ఆమెతో కొద్దిపాటి పరిచయం వున్నవారు.

ఇంకేం ?... సన్మానంలో బహూకరించే పర్సుకోసం ప్రయత్నాలు ప్రారంభం అయ్యాయి. ఒక్క నిముషం తీరిక లేకుండా ఇద్దరు ముగ్గుర్ని తీసుకుని ఇల్లిల్లూ తిరిగింది శాంతమ్మ. బయట నుంచి వచ్చిన ఆమె రెండువందలు ఇస్తే ఆ ఊరి వాళ్లయి పదిరూపాయలు ఇస్తే ఏం బాగుంటుం దనుకున్న ఆడవాళ్లు ఘనంగానే ఇచ్చారు సొమ్ము. చాలామంది ఆసక్తి చూపించారు.

"కమిటీ వాళ్లు ఎలాగూ ఇస్తున్నారు ... ఇక విడిగా ఎందుకు ?" అని ఒకరిద్దరు మగవాళ్లు అన్నారు . కానీ ఆడవాళ్లు వాళ్లని ఒప్పించేశారు.

"అది మీ తరఫునుంచి... ఇది మా తరఫు నుంచి ..." అన్నారు.

ఎంతయినా స్త్రీ శక్తి స్వరూపిణి కదా!

శాంతమ్మగారి శ్రమ ఊరికే పోలేదు. ఆ శ్రమకు తగ్గ ఫలితం లభించింది... మూడు వేల రూపాయలు పోగయ్యాయి. తృప్తిగా నిట్టూర్చింది ఆమె.

కమిటీవాళ్లు పరమేశ్వరశాస్త్రిని కలిశారు.

"కథ పూర్తి అయిన మరుసటి రోజు మీకు సన్మానం చేసి 'పర్సు' బహూకరించాలని మేం నిర్ణయించుకున్నాం. మీరు అంగీకరించాలి" అన్నారు.

ఆయన కళ్లు ఆనందంతో మెరిశాయి.

"మీ అందరికీ నాయందు కల్గిన ఆదరాభిమానాలకు కృతజ్ఞుడిని. నేను సామాన్య మానవుడిని. నాకు ఇంత మర్యాద కల్పించడం కేవలం నా అదృష్టమేతప్ప నేను అందుకు అర్హుడిని కాను... నిజానికి నాకు ఈ సన్మానాలంటే ఇష్టంలేదు. కానీ... ఇంత ఉత్సాహంతో ముందుకు వచ్చిన మిమ్మల్ని కాదనడం నాకు ఇష్టంలేదు..." అన్నారు ఎంతో వినయంతో. ఆ వినయానికి ముగ్ధులైపోయారు ఆయన ఒప్పుకున్నందుకు ఆనందించేరు.

అనుకున్నట్లుగానే సన్మానం జరిగింది. పర్సు బహూకరించబడింది. పరమేశ్వరశాస్త్రిగారు ఆనందంతో తలమునకలవుతున్నారు.

"నేను ఎన్నోచోట్లకు వెళ్లాను. కానీ ఇంత ఘనసన్మానం జరగలేదు. నిజంగా మీరందరూ దానకర్ణులు... మిమ్మల్ని నేను ఎక్కడ వున్నా మర్చిపోలేను... మీకందరకూ కృతజ్ఞతలు. కరుణామయుడైన భగవంతుడు మిమ్మల్ని, ఈ ఊరుని చల్లగా చూడుగాక..." అన్నారు పరమేశ్వరశాస్త్రిగారు కృతజ్ఞతలు తెలుపుకుంటూ.

ఆ సన్మానానికి వెన్నెముకగా ఎవరో 'శాంతమ్మ'గారిని పేర్కొన్నారు

ఆమె వచ్చి ఆయనకు నమస్కరించింది. ఆయన చెయ్యి ఎత్తి దీవించారు...

"కలకాలం ముత్తయిదువుగా, సుఖసంతోషాలతో, భోగభాగ్యాలతో, ఆయురారోగ్యాలతో వర్థిల్లు తల్లీ..." అంటూ దీవించి ఆమెకు-కల మంచిమనసును పొగిడేరు.

"క్షమించండి స్వామీ ... ఇదంతా కేవలం ఈ ఊరివారి సహకారం తప్ప ఇందులో నేను ప్రత్యేకంగా చేసింది ఏముంది? ఈ ఊరి ప్రజలందరూ ధర్మచింతన కలవారు కనుక నా పని మరింత తేలిక అయ్యింది. మీ మంచి ఆశీస్సులు అందుకోగల్గిన అదృష్టం కల్గినందుకు చాలాసంతోషిస్తున్నాను. మిమ్మల్ని గౌరవించడం అంటే ఆ దేవదేవుడిని గౌరవించినట్లే. ఆ భాగ్యం మాకు కలగజేసినందుకు మీకే మేము కృతజ్ఞులము. ఏ పూర్వజన్మ సుకృతమో లేకపోతే

సన్మానం వెనుక

మీలో ఇంత వర్చస్సు, జ్ఞానసంపద కలుగుతాయా?... మీ దర్శన భాగ్యం కలిగి మేం ధన్యులం అయ్యాము..." అంది శాంతమ్మగారు.

పరమేశ్వర శాస్త్రిగారు ఆనందాన్ని కళ్ల ద్వారా వ్యక్తం చేశారు.

ఆ మర్నాడే ఆయన ప్రయాణం.

కమిటీ వారు ఆయనకు ఇయ్యవల్సిన మొత్తాన్ని తాంబూలంలో పెట్టి ఇచ్చేసి ఒక నమస్కారం పెట్టారు.

ఆయన్ని బస్సు ఎక్కించడానికి వచ్చిన వారిలో ఒకరు–

"స్వామీ! ...ఇన్నిరోజులుగా మీరు ఒక్కరే వున్నారు... మీ శ్రీమతిని కూడా తీసుకుని వచ్చి వుంటే ఆమె దర్శనం కూడా చేసుకుని సంతోషించేవాళ్లం" అన్నాడు.

ఆయన చిన్నగా నవ్వి –

"ఆమె ఎప్పుడూ అనారోగ్యంతో మంచం మీదే వుంటుంది ... ఏదో ఆ భగవంతుడి దయ వల్ల రోజులు గడిచిపోతున్నాయి కానీ... ఒకరోజు విందు, మరొకరోజు మందు అవుతోంది." అన్నారు ఆయన.

అది విని కొద్దిగా చింతించేరు.

బస్సులో కూర్చున్న శాస్త్రిగారు కిటికీ లోంచి అందరికీ నమస్కారం పెట్టారు.

సాగనంపడానికి వచ్చిన వాళ్ళు కూడా వినయంగా నమస్కరించారు.

ఆయన కళ్లు చెమ్మగిల్లాయి ... ఈ నెలలోనే ఈ ఊరితో అంత సత్సంబంధం పెంచుకున్నారు.

బస్సు కదిలింది

* * *

పరమేశ్వరశాస్త్రిగారు వెళ్లిపోయిన రెండు రోజుల తర్వాత శాంతమ్మ ప్రయాణం అయింది

"ఇప్పటికే నేను వచ్చి చాలా రోజులయ్యింది. ఆయన, పిల్లలు చెయ్యి కాల్చుకుంటూ అవస్థ పడుతుంటారు. ఇక నేను వెళ్లాలి..." అని ఇరుగు పొరుగువారికి చెప్పి ప్రయాణం అయ్యారు.

ఆంధ్ర పత్రిక

దిన పత్రికలో

* మన సినిమాలు
* వింత యదార్థం

శీర్షికలు

చూస్తున్నారా?

గుమ్మంముందు రిక్షా ఆగడం, అందులోంచి శాంతమ్మ దిగడం చూసిన పరమేశ్వర శాస్త్రిగారు అరుగుమీదకు వచ్చి చిరునవ్వుతో భార్యను ఆహ్వానించారు.

"రా శాంతా.. రా..." అన్నారు.

శాంతమ్మగారుకూడా చిరునవ్వు నవ్వి ఇంట్లోకి వచ్చింది.

మంచినీళ్ళు తాగింది..

భర్తతో నిష్ఠూరంగా ఉంది –

"మన అంతర్నాటకం కాదుగానీ... ఆ ఊళ్ళోవున్న నెల రోజుల్లో ఒక్కసారికూడా మీరు అన్నయ్య ఇంటికి రాలేదు... వాడు ఎంత బాధ పడ్డాడో... మీరు ఒక్కరోజుకూడా ఆ ఇంట్లో ఎంగిలి పడలేదని.."

ప్రసన్నంగా నవ్వేరు శాస్త్రిగారు.

"అవును మరి... అనుకున్నది సాధించాలంటే ఇలాంటివి పట్టించుకోకూడదు. కమిటీ వారు ఉచితంగా భోజనం ఏర్పాటు చేశారు. కనుక నష్టపోయింది లేదు... మనిద్దరికీవున్న సంబంధం తెలిస్తే మూడువేల రూపాయలు పోగయ్యేవా?... నిన్నుకూడా కేవలం హరికథ చెప్తున్నంతసేపేగానీ ఆ తర్వాత చూశానా?.. వాళ్లకి ఏ రకమైన అనుమానం కలగకూడదు... అందుకే అలా ప్రవర్తించాను... నువ్వేదో పరాయి వ్యక్తిగా సహాయం చెయ్యడానికి ముందుకు రావడమే మిగతావాళ్లతో డబ్బులిచ్చేలా చేసింది" అన్నారు పరమేశ్వరశాస్త్రిగారు.

"ఆ ఊరి ప్రజలు చాలా మంచివాళ్లండీ వాళ్లను మోసం చెయ్యడం పాపం అనిపిస్తుంది అప్పుడప్పుడు..." అంది శాంతమ్మ.

"నమ్మారు కనుకనే వంచించగలిగాం కానీ నమ్మకపోతే ఏం చెయ్యగలం? అలాంటివి పట్టించుకోకూడదు. పురాణగాథల్లో మాత్రం మోసాలు లేవా?.. పురాణగాథలు హరికథలుగా చెప్పిచెప్పి ఆ మోసాలు నాకు వంటబట్టాయి ... మొదటిసారిగా దాన్ని కార్యరూపంలోకి తెచ్చాం.." అన్నారు శాస్త్రిగారు.

శాంతమ్మ హఠాత్తుగా అంది –

"ఆ డబ్బు ఏం చేద్దాం?"

"ఏం చెయ్యడమేమిటి?... ఖర్చు ముందు నుంచీ కాసుకుని కూర్చుంది కదా ... మన అబ్బాయికి మూడువేలు లంచం ఇస్తే ఉద్యోగం ఇస్తానని అన్నారు కదా... ఈ సొమ్ము అందుకే ఖర్చు పెడదాం... అన్యాయంగా సంపాదించిన సొమ్ము అన్యాయపు పనికే ఖర్చు పెడదాం అన్నారు పరమేశ్వరశాస్త్రిగారు విచారంగా కుళ్ళిపోయిన సంఘాన్ని తల్చుకుని ...

ఆ దంపతులిద్దరికీ కళ్లముందు ఆశలు –

తమ కొడుకు ఉద్యోగస్తుడవుతాడు ... తమని సుఖపెడతాడు ...

ఆ కోరిక చాలా సహజమైనది... ఆకలి వేసినపుడు అన్నం తింటే కడుపు నిండినంత సహజమైనది. ★